
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 30 జనవరి 2024





పత్తి రైతులు నిండా మునిగారు. ఈ యేడు కూడా నష్టాల ఊబిలోనే చిక్కుకున్నారు. పూత, కాత సమయాల్లో సరైన వానల్లేక చేలు ఎండిపోయాయి. దిగుబడి 20శాతానికి పైగా తగ్గడంతో కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా పోయాయని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సరైన ధర కూడా రాలేదని చెబుతున్నారు. పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చౌదరిపల్లిలో ఎండిపోయిన పత్తి మొక్కలు

అప్పులు మిగిల్చిన పత్తి



- ఎకరాకు రూ. 31వేల పెట్టుబడి
- పంట అమ్మితే రైతుకొచ్చింది రూ. 20వేలు
- వర్షాభావంతో భారీగా పడిపోయిన దిగుబడి

యాచారం, జనవరి 29 : ఈ ఏడాది వానాకాలంలో వర్షాభావంతో అనుకున్న మేర పంట దిగుబడి రాక పత్తి రైతులు అప్పుల్లో కూరుకుపోయారు. పెట్టుబడి అయినా చేతికందలేదు. ఎకరం విస్తీర్ణంలో రెండు, మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. సాధారణంగా ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది. అయితే, ఇప్పుడు మూడు, నాలుగు క్వింటాలకు మించి రావడం లేదు. నామమాత్రపు దిగుబడితో తాము అప్పుల్లో కూరుకుపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత, కాత సమయాల్లో వానల్లేక ఒక్కో చెట్టుకు మూడు నాలుగు కాయలే వచ్చాయని రైతులు చెబుతున్నారు. అప్పులు తీర్చేందుకు పొలం అమ్ముకునే పరిస్థితి వచ్చిందని మేడిపల్లికి చెందిన రైతులు బీరప్ప, మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో చెట్టుకు 25 నుంచి 35 కాయలు వస్తేనే ఆశించిన దిగుబడి వస్తుందని.. కానీ ఈ సారి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. దీపావళి నుంచి నెల పాటు నాలుగైదు సార్లు పత్తి ఏరే వారిమని, అలాంటిది ఈ సారి ఒక్కసారి ఏరగానే పత్తిమొక్కలు ఎండిపోయాయని రైతులు వాపోయారు. ప్రధానంగా అక్టోబరు, నవంబరు నెలల్లో ఒక్క వాన కూడా కురవకపోవడంతో మొక్కలకు నీరందక ఎండిపోయాయని, దీంతో దిగుబడి 20శాతానికి పడిపోయిందని రైతులు వివరించారు. ఒక పక్క దిగుబడి లేకపోగా ధర కూడా అనుకున్నంత పెట్టలేదని రైతులన్నారు. వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6,900 మాత్రమే చెల్లించారని చెప్పారు.



యాచారంలో ఎండిపోయిన చేను

అన్ని ఖర్చులూ కలుపుకుంటే ఎకరం పత్తి సాగుకు రూ.31వేల వరకు వ్యయమవుతుంది. ఈ సారి వచ్చిన దిగుబడి అమ్మగా రైతులకు 20వేలకు మించి రాలేదు. దీన్నిబట్టి ప్రతీ ఎకరానికి రూ.11వేల మేర రైతులు నష్టపోయారు.

లాభం దేవుడెరుగు.. పెట్టుబడైనా రాలేదు!

అదీ పెట్టుబడే. లాభాన్ని కలుపుకుంటే మరో 30వేలు అదనపు నష్టం! ఎకరంలో 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తి వస్తేనే పెట్టుబడి పోను ఎంతోకొంత మిగులుతుందని మహిళా రైతు రాములమ్మ తెలిపారు. ఈ సారి నాలుగైదు క్వింటాళ్ల కంటే ఎక్కువ పండలేదని చెప్పారు. కనీసం ఆరుసార్లు పత్తి ఏరే వారమని, వర్షాలు పడక ఒక్కసారి ఏరగానే మొక్కలు ఎండిపోయాయని పత్తి రైతులు చెప్పారు. క్వింటాల్‌కు రూ.పది నుంచి రూ.15వేల ధర ఉంటే పంట ఖర్చులు పోను రెక్కల కష్టమైనా మిగిలేదని, కానీ వ్యాపారులు క్వింటాలుకు రూ.6,900 కంటే ఎక్కువ పెట్టలేదని మేడిపల్లికి చెందిన రైతు కలకొండ బీరప్ప చెప్పాడు. ఇదిలా ఉంటే భూ యజమానులతో మాట్లాడుకున్న మేరకు వారికి కౌలు చెల్లించామని, తమకు దిగుబడి మాత్రం రాలేదని కౌలు రైతులు వాపోతున్నారు. సొంత భూమి ఉన్న వారికంటే రెట్టింపు అప్పుల్లో తాము కూరుకుపోయామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్ల బంగారం పంట తమను నట్టేట ముంచిందని, ప్రభుత్వమే ఎకరానికి రూ.పదివేల చొప్పునైనా పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పులెలా తీర్చాలో తెలియడం లేదు



పత్తి సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ఎకరానికి రూ.30వేలకు మించి పెట్టుబడి పెట్టాం. క్వింటాల్ పత్తికి రూ.6,900 వచ్చింది. ఈ సారి ఎకరానికి నాలుగు క్వింటాళ్లకు మించి పండలేదు. కనీస ధర రూ.10వేలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే రైతులకు కొంత మేలు జరిగేది. ఈ సారి కరువు వల్లే పత్తి రైతులం నష్టపోయాం. ప్రభుత్వం మాకు కరువు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- కొంగరి కృష్ణయ్య, రైతు, చౌదరిపల్లి



ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

కందుకూరు, జనవరి 29 : మండలంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సోమవారం ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌డీవోను కలిశారు. వారు మాట్లాడుతూ.. కందుకూరు, నేదునూరు గ్రామాల్లో సంవత్సరాల క్రితం నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారన్నారు. అయితే నేటికీ వారికి పొజిషన్ చూపలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, డి.రాంచందర్, సాయిలు, ఎ.జంగయ్య పాల్గొన్నారు.

నేడు దెబ్బడగూడకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక



కందుకూరు, జనవరి 29 : దెబ్బడగూడలో రూ.50లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం రానున్నట్లు గ్రామ సర్పంచ్ ఏనుగు శ్రావణి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. నేటి ఉదయం 11గంటలకు మంత్రి శ్రీధర్ బాబు తమ గ్రామానికి వస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, మండలంలోని సర్పంచ్‌లు సైతం రానున్నారని చెప్పారు. అధికారులు, కాంగ్రెస్ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



భగద్గీత గ్రంథాన్ని ఎంపీటీసీకి అందజేస్తున్న ప్రబోధ కమిటీ సభ్యులు

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి

చౌదరిగూడ, జనవరి 29: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ కార్యవర్గ సభ్యుడు నాగ్యానాయక్ అన్నారు. సోమవారం ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుడు రచించిన భగవద్గీత, వేమన పద్యాల అనుబంధ గ్రంథాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యప్రమోద్, శ్రీనివాసులు, తిరపతయ్య, కృష్ణయ్య, నీలిమ, అమ్ములు, సావిత్రమ్మ, కిషోర్ బుచ్చిలింగం, వెంకటేష్, విష్ణు పాల్గొన్నారు.



అమ్మా నాన్నలకు పాదపూజ చేస్తున్న పిల్లలు

అమ్మా నాన్నలకు పాదపూజ

షాబాద్, జనవరి 29 : షాబాద్ మండల కేంద్రంలో సోమవారం సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీచైతన్య హైస్కూల్, కస్తూర్బా, శిశుమందిర్ పాఠశాలల్లోని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలను పిల్లలకు వివరించారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్ డే బదులుగా మనం అమ్మానాన్న పూజా దినోత్సవం జరుపుకోవాలని ఆశ్రమం నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ అమర్నాథ్, రాజేందర్, పరమేశ్వర్, శరత్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



నోవాటెల్ హోటల్ సిబ్బందిని అభినందిస్తున్న జీఎం సుఖ్బీర్‌సింగ్

ఎయిర్‌పోర్టు 'నోవాటెల్'కు గ్రీన్ కీ సర్టిఫికేషన్

శంషాబాద్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌కు గ్రీన్ కీ సర్టిఫికెట్ వచ్చిందని హోటల్ ప్రతినిధులు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఈ ప్రతిష్ఠాత్మక పర్యావరణ సర్టిఫికెట్ పొందిన హోటల్ దక్షిణ భారత్‌లోనే ఇది మొదటిదన్నారు. తాము నేషనల్ జ్యూరీ గ్రీన్‌కీ ఇండియా, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్(సీఈఈ) ద్వారా ఈ సర్టిఫికేషన్ రావడం సంతోషంగా ఉందన్నారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్ ఎల్లప్పుడూ అతిథితులకు స్థిరమైన, ఆరోగ్యకరమైన వసతి అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇందులో ఈవీ చార్జింగ్ స్టేషన్లు, వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, గదుల్లో ఎనర్జీ సేవింగ్ ట్యాగ్‌లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం, అతిథులకు మూలికలు, ఆకుకూరలు అందించడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం లాండ్రి నీటి వినియోగాన్ని మెరుగుపర్చడం మొదలైన విధానాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కృషికి ఫలితంగానే ఈ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. గ్రీన్ కీ సర్టిఫికేషన్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎకో లేబుల్, పర్యావరణ హితానికి కట్టుబడి సేవలందించే హోటళ్లు, రిసార్ట్‌లకు, అతిథ్య సంస్థలకు ఇస్తారని పేర్కొన్నారు. మున్ముందు మరిన్ని సేవలను కస్టమర్లకు అందజేస్తామని హోటల్ జీఎం సుఖ్బీర్‌సింగ్ తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 29 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సరిపడా సిబ్బందిని గుర్తించాలని సూచించారు. కనీసం 20 శాతం మేర సిబ్బందిని రిజర్వులో సిద్ధంగా ఉంచాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్ విధుల కోసం వేర్వేరుగా సిబ్బందిని నియమిస్తూ ఎన్నికల విధుల పట్ల వారికి పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలి.

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యత నిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీఆర్‌వో సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

ప్రజావాణికి డుమ్మా కొట్టిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

జిల్లా స్థాయి అధికారులు ప్రజావాణికి డుమ్మా కొట్టడంపై జిల్లా కలెక్టర్ శశాంక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ బాధ్యతలు స్వీకరించాక అధికారులంతా ప్రజావాణికి హాజరు కావాలని ఆయన ఆదేశాలు చేశారు. అయినప్పటికీ.. సోమవారం పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. కొంత మంది జిల్లా అధికారులు వారు ప్రజావాణికి హాజరు కాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపించడంపై ఆయన మండిపడ్డారు.

పార్లమెంట్ ఎన్నికలకు పునాదులు వేసుకోండి

- పార్టీ కోసం కలిసికట్టుగా కష్టపడి పని చేయండి
- ఎంపీ రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించండి
- స్థానిక సంస్థల్లో మిమ్మల్ని ఆయన గెలిపిస్తారు
- గతంలో జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుందాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జనవరి 29 : ఎంపీ ఎన్నికలు వస్తున్నాయి.. ఇవి ముగియగానే.. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి... ఇప్పుడే ఎన్నికలకు పునాదులు వేసుకోండి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం చేవెళ్లలో నిర్వహించిన చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ గత ఎన్నికలో జరిగిన పొరపాట్లను మరోసారి పునరావృతం కాకుండా పార్టీ నేతలు జాగ్రత్త పడాలని తెలిపారు. పార్టీలో పదవులు లేని నాయకులకు సముచిత స్థానం కల్పించనున్నట్లు భరోసా ఇచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు అండగా ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలయ్యేలా ప్రజల తరపున పోరాటం చేయాలని ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చేవెళ్లకు కేసీఆర్ రానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. షాబాద్ మండలంలో అనేక కంపెనీలను స్థాపించి ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. కేసీఆర్ పేదలకు నిరంతరం అండగా ఉండి పనిచేస్తారని అన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని సూచించారు. ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో ప్రజల్లోకి వస్తారని చెప్పారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలు మాట్లాడుతూరానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పనిచేయాలన్నారు. చేవెళ్ల ప్రజలకు అందుబాటులో ఉంటానని, మరోసారి గెలిపించాలని రంజిత్‌రెడ్డి కోరారు. బీఆర్ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు రావడం లేదని కేటీఆర్ సమక్షంలోనే ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫర్నిచర్ కోసం జడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ చెక్కును కేటీఆర్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ కాంచనమాలకు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పటోళ్ల కార్తీక్‌రెడ్డి, ఎంపీపీలు విజయలక్ష్మి, నక్షత్రం, గోవర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీలు అవినాష్‌రెడ్డి, గోవిందమ్మ, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్, మహేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, నాయకులు దేశమొళ్ల ఆంజనేయులు, హన్మంత్‌రెడ్డి నరేందర్‌గౌడ్, పట్లోళ్ల కృష్ణారెడ్డి, శేరి పెంటారెడ్డి, కుంచం శివకుమార్ గుప్త, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న కేటీఆర్

ఎమ్మెల్యే యాదయ్యకు ఏమైంది?

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి దాదాపు గంట సేపు ఆయనతో మంతనాలు జరిపిన విషయం తెలిసిందే. ఆయన సీఎంను మర్యాదపూర్వకంగానే కలిసినట్లు చెబుతున్నా ఆయన త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇలాంటి తరుణంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం జరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీటింగ్‌కు గైర్హాజరు కావడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు యాదన్న ఎందుకు రాలేదు.. అతనికి ఏమైందన్న విషయాన్ని చర్చించుకున్నారు. ఇటీవలే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి కలుస్తున్న నేపథ్యంలో కాలె యాదయ్య కూడా కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్లు ప్రచారం జరిగింది. చేవెళ్ల మీటింగ్‌కు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాలె యాదయ్యకు ఫోన్ చేసి మాట్లాడారు. తనకు ఆరోగ్యం బాగాలేదని, అందుకే మీటింగ్‌కు రాలేకపోయినట్లు వివరణిచ్చారు. యాదయ్య తన ఇంట్లో రెండు రోజుల క్రితం హోమం నిర్వహించారని, పొగ కారణంగా అనారోగ్య సమస్య ఏర్పడిందని పార్టీ నేత మర్పల్లి కృష్ణారెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అయితే, కేటీఆర్ సభావేదికపైకి వచ్చే వరకు యాదయ్య ఈ సమావేశానికి రావడం లేదనే విషయం పార్టీ వర్గాలకు కూడా సమాచారం లేకపోవడం గమనార్హం.

పాడుబడ్డ బావులతో గుబుల్!

● రోడ్ల పక్కనున్న వ్యవసాయ బావుల పూడ్చివేతకు చర్యలేవి?



మల్కీజ్‌గూడలో ప్రమాదకరంగా ఉన్న పాత వ్యవసాయ బావి

యాచారం, జనవరి 29: మండలంలోని వివిధ గ్రామాల్లో పాడుబడ్డ వ్యవసాయ బావులు వాహనదారులకు, గ్రామస్తులకు ప్రమాదకరంగా మారాయి. రోడ్ల పక్కన ఉన్న బావులను పూడ్చివేయించాల్సిన అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి బావులపై స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం పట్టింపు లేకుండా పోయింది. మల్కీజ్‌గూడలో రోడ్డుకు ఆనుకొని ఓ వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. దీన్ని పూడ్చి వేయించడమో లేక ప్రహరీ నిర్మించడమో చేయాలి. బావి వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులూ పెట్టలేదు. రోడ్డుకు గజం దూరం లోపలే ఈ బావి ఉంది. ఈ బావిలో గ్రామస్తులు చెత్త వేస్తున్నారు. ఇదే గ్రామంలో మేడిపల్లి వెళ్లే రోడ్డులో మరో వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. చింతపట్ల నుంచి సాగర్-హైదరాబాద్ రోడ్డుపైకి వచ్చే రోడ్డులో ఓ బావిని సగం పూడ్చి వదిలేశారు. రోడ్డు పక్కనే బావి ఉండడతో వాహనాదారులు భయం భయంగా వెళ్తున్నారు. నజ్దిక్‌సింగారం-అయ్యవారిగూడల మధ్య రోడ్డు పక్కనే రెండుచోట్ల పాడుబడ్డ బావులున్నాయి. వీటిని పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న ఇలాంటి బావులను పూడ్చివేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపైనే సంతలు.. తప్పని తిప్పలు



యాలాలలో నడి రోడ్డుపై కొనసాగుతున్న సంత

యాలాల, జనవరి 29: ప్రతీ వారం గ్రామాల్లో రోడ్లపైనే కొనసాగుతున్న సంతలతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంతల నిర్వహణకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నా పట్టించుకున్న నాథుడే కరువడయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. యాలాల మండలంలో ప్రతీవారం నాలుగు గ్రామాల్లో సంతలు కొనసాగుతాయి. మండల కేంద్రమైన యాలాల్లో సోమవారం, రాస్నంలో బుధవారం, పగిడ్యాల్‌లో శుక్రవారం, ముద్దాయిపేట్‌లో ఆదివారం సంతలు కొనసాగుతున్నాయి. ఈ సంతలన్నీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిస్తున్నారు. అయితే ప్రతీవారం కొనసాగే సంతల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయితీ పరిధిలో కొనసాగే ఈ సంతలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు గ్రామస్థులు కోరారు. అయినా ఏ ఒక్కరూ స్పందించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో కొనసాగే సంతలకు గ్రామపరిధిలో ప్రత్యేక స్థలం కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

నేడు మేడ్చల్ మండల సర్వసభ్య సమావేశం

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పద్మశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశం మందిరంలో సమావేశం ప్రారంభిస్తారని తెలిపారు. కావున గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ గోవర్ధనగిరి



ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సీఐ గోవర్ధనగిరిని కలిసిన కాంగ్రెస్‌నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29: ఘట్‌కేసర్ సీఐగా గోవర్ధనగిరి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సీసీఎస్ ఎల్‌బీనగర్ నుంచి ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన మద్ది మహేందర్‌రెడ్డి సైబర్‌క్రైంకు బదిలీపై వెళ్లారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు గోవర్ధనగిరికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, మాజీ ఎంపీటీసీ కందుల కుమార్, బద్దం కుమార్, వెంకట్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకులాలు, కళాశాలల కోసం స్థల పరిశీలన

కొడంగల్ / దౌల్తాబాద్/బొంరాస్‌పేట్ : జనవరి 29: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాల్లో సోమవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా దౌల్తాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం స్థల పరిశీలన చేసి నివేదిక తయారు చేస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలలు ఒకే దగ్గర ఉండాలనే ఉద్దేశంతో గిరిజన గురుకుల బాలుర పాఠశాల పరిసర ప్రాంతాల్లోనే ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, దౌల్తాబాద్‌లో జూనియర్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు, త్వరలోనే పనులను ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు.

బొంరాస్‌పేట్‌లో

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం స్థలాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆవరణల్లో స్థలాన్ని తహసీల్దార్ రవి, ఆర్ఐ రవి, సర్వేయర్ దేవేందర్‌లతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం స్థలాలను పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.



బొంరాస్‌పేట్‌లో కళాశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి, నాయకులు

విద్యారంగ సమస్యలపై వినతి

కొడంగల్ నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుంకరి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య, హకీం బాల్‌రాజ్, కార్యదర్శి బాకారం మొగులప్ప, మండల అధ్యక్షుడు నారాయణ, గౌరవ అధ్యక్షుడు టి.రాములు, ట్రెజరర్ కృష్ణయ్య, కార్యదర్శి పృథ్వీసింగ్, బొంరాస్‌పేట్ మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న తపస్ నాయకులు

గట్టు మైసమ్మ జాతర హుండీ లెక్కింపు



గట్టుమైసమ్మ హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

ఘట్‌కేసర్, జనవరి 29 : ఆదివారం జరిగిన ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర హుండీలను సోమవారం దేవాలయ కార్యాలయంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.2,17,713 వచ్చినట్లు ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించాల్సి ఉందని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్‌చైర్మన్ పల్లుగుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నాయకులు కొంతం అంజిరెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, ముత్యాలు, బర్ల రాధాక్రిష్ణ, బర్ల హరిశంకర్, నారాయణ, దేవాలయ సిబ్బంది, పాల్గొన్నారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిను చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.





కార్యకర్తలపై ఈగ వాలినా సహించం

● తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరురూరల్, జనవరి 29 : గ్రామాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలపై ఈగ వాలినా సహించేది లేదని, పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం, చంద్రవంచ గ్రామాల్లో రూ.40లక్షలు రూర్బన్ పథకం నిధులతో పూర్తయిన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ఎంపీపీ ఎస్.అనితా గౌడ్, సర్పంచ్‌లు సావిత్రిబాయి రాంచందర్, బి.శ్రీదేవి విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించిన వారికి అండగా ఉంటానన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల సమయంలో చంద్రవంచ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరించినట్లు తమ దృష్టికి వచ్చిందని, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లా కావడంతో అభివృద్ధికి అధిక నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. వైస్‌ఎంపీపీ స్వరూపా, జెడ్పీటీసీ గౌడి మంజుల, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, స్థల దాతలు నరోత్తం, వాసుపవార్‌నాయక్, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, వడ్డె శ్రీనివాస్, గుర్రంపల్లి రాందాస్, న్యాయవాది మహేందర్‌రెడ్డి, బి.విజయ్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు మల్లప్ప, రాంచందర్, రాజేందర్‌రెడ్డి, ఉదయ భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, అంజిలయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



చంద్రవంచ గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కల్వకుర్తిలోని ప్రతి ఎకరాకు సాగునీరు

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్ , జనవరి 29 : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందించి, రైతుల కలలు సాకారం చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అసంపూర్తిగా ఉన్న సాగునీటి పథకాలను పూర్తిచేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామంలో రూ.20 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్ నాయక్, సర్పంచ్ పోతుగంటి శంకర్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అన్మాస్‌పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీకి ప్రహరి గోడ నిర్మాణానికి ఎస్డీఎఫ్ నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలలో కల్వకుర్తి నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యం, వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. గ్రామాలలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్ లకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని సర్పంచ్‌లు ఆందోళన చెందవద్దని చెప్పారు. మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ పాలకుర్ల రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఏఈ పరమేశ్, పంచాయతీ కార్యదర్శి హరీశ్ రెడ్డి, నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, హన్మనాయక్, ముత్తి కృష్ణ, చేగూరి వెంకటేశ్, సుధీర్ రెడ్డి, పాపిరెడ్డి, చందోజీ, బిక్షపతి, యాదగిరి రెడ్డి, నరేశ్ నాయక్, మోత్యానాయక్, శేఖర్‌గౌడ్, సుమన్, లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, ఇమ్రాన్‌బాబా, రామకృష్ణ, జగన్,శ్రీను, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అన్మాస్‌పల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, తదితరులు

వసతి గృహాల్లో పరిశుభ్రతపై అవగాహన

వికారాబాద్, జనవరి 29 : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా పరిశుభ్రమైన భోజనం అందించేందుకు కుక్, కామాటి, నాలుగో తరగతి సిబ్బందికి శుభ్రతపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.శరత్ , డైరెక్టర్ నరసింహ రెడ్డి ఆదేశానుసారం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు/వసతి గృహాల/కళాశాల వసతి గృహాలలో పని చేస్తున్న సిబ్బంధికి నూతన వంట పద్దతులు, ఆహార భద్రత, వసతి గృహాల పరిశుభ్రతపై అవగాహన కల్పించామని చెప్పారు. వికారాబాద్ సిడిపిఓ వెంకటేశ్వరి, వైద్యఆరోగ్యశాఖ మీడియా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి కోటాజీ

కేటీఆర్‌కు మతి భ్రమించింది

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్, జనవరి 29 : అధికారం కోల్పవటంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావుకు మతిభ్రమించిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఎద్దేవా చేశారు. సోమవారం ఘట్‌కేసర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. ఓటమి తర్వాత కేటీఆర్‌కు పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం 50రోజులే ఐనప్పటికీ ప్రభుత్వంపై నోరుపారేసుకోవటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఘడీల్లో బందీ ఐన దొరల పాలనను ప్రజల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ప్రజలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు కర్రు కాల్చి వాత పెట్టినా, వారి తీరు మారడంల లేదన్నారు. కేటీఆర్ తీరుకు విసుగు చెంది ఆయన నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు మూకుమ్మడి రాజీనామాలకు దిగుతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావటం ఖయమన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా అవాకులు చెవాకులు పేలటం మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోవాలని కేటీఆర్‌కు హితవు పలికారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, జనవరి 29 : హోంగార్డుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని రాష్ట్ర హోంగార్డు సంఘం సభ్యులు తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ చైర్మన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. సోమవారం రాష్ట్ర హోంగార్డ్స్ సంఘం సభ్యులు అశోక్ వరంగల్, దయానంద్ కొత్వాల్ , కుమారస్వామి, అశోక్‌కుమార్ సైబరాబాద్ , హరిబాబు, చాంద్‌పాషా వికారాబాద్, వివిధ జిల్లాల హోంగార్డులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర హోంగార్డ్స్ సంఘం సభ్యులు

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జనవరి 29 : పెద్దేముల్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. జడ్పీటీసీ ధారాసింగ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మండలస్థాయి క్రీడలను నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మినీస్టేడియం నిర్మించేందుకు ఆసక్తి కలిగిన దాతలు ముందుకు రావాలని కోరారు. స్టేడియం నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. లేదంటే సీడీపీ నిధుల నుండి తానే ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. జిల్లాలోనే మోడల్‌గా ఇండోర్ స్టేడియాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనువైన స్థలం ఉంటే చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రతి విద్యార్థి కూడా కొంత సమయాన్ని క్రీడలకు కెటాయించాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని చెప్పారు. క్రీడాకారులతో కరచాలనం చేసి వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడలను ప్రారంభించారు. వైస్‌ఎంపీపీ మధులత, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, వైద్యులు సంపత్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాని, నాయకులు ఉత్తంచంద్, ఏబ్లాక్ అధ్యక్షుడు లొంకనర్సిములు, న్యాయవాది ఎల్లారెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

కీసర, జనవరి 29 : ప్రజావాణి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 129 ఫిర్యాదులు వచ్చాయని, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపుకలెక్టర్



శంషాబాద్ నుంచి కార్ల ఊరేగింపుతో వెళ్తున్న సేవెళ్ల మహేందర్

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడి కార్ల ర్యాలీ

శంషాబాద్, జనవరి 29 : బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన శంషాబాద్‌కు చెందిన సేవెళ్ల మహేందర్ సోమవారం పట్టణ కేంద్రంలో కార్లతో ర్యాలీ నిర్వహించి నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఊరేగింపుగా వెల్లారు. శంషాబాద్ పోచమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ హనుమాన్‌బస్తీ, రైల్వేకమాన్, సిద్దప్పరోడ్డు, మహవీర్‌బిల్డర్స్, బస్టాండు చౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా, గుండా సాగింది. కార్యకర్తలు బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ బీజేవైఎంకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తెస్తానని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు కృషిచేస్తానన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు

● కదులుతున్న రైలు ఎక్కుతూ కింద పడి..

● ప్రాణాలతో బయటపడి..

వికారాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కదులుతున్న రైలు ఎక్కుతున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు ప్లాట్‌ఫారం కింద పడిపోయాడు.. ప్రాణాలతో బయట పడ్డాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో జరిగింది. ఒకటో ప్లాట్‌ఫాం నుంచి బయలు దేరిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఓ వ్యక్తి పరుగెత్తుతూ ఎక్కబోయి ఆ వేగానికి ప్రమాదవశాత్తు ప్లాట్‌ఫారం కిందకు దూసుకు వెళ్లాడు. ఆ సమయంలో కింద పడ్డ వ్యక్తి ప్లాట్‌ఫారం వైపు ఒదిగి ఉండిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు కేకలు వేస్తూ అప్రమత్తం చేయడంతో రైలును నిలిపివేశారు. కాగా, ప్లాట్‌ఫారం, రైలు మధ్య ఇరుక్కు పోయిన ఆ వ్యక్తి (45)ని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. తుది ప్రయత్నంగా ప్లాట్‌ఫారంను కొంత భాగం తొలగించి అతన్ని బయటకు తీశారు. ప్లాట్‌ఫారం బయటకు తీసే ప్రయత్నంలో ఆ వ్యక్తికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, గాయపడ్డ ఆ వ్యక్తి ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణిస్తున్నాడు, అతను ఎవరనేది వివరాలు తెలియరాలేదు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

చేవెళ్ల, జనవరి 29 : విద్యార్థులు బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని చేవెళ్ల జెడ్పీటీసీ ఎం.మాలతిరెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల, అంతారం, కౌకుంట్ల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల పదో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆమె అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. పరీక్షల్లో 10/10 గ్రేడ్ సాధించాలని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో అక్బర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ మాలతీరెడ్డి

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

చేవెళ్ల, జనవరి 29: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సాగర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సురేశ్ గరిమెళ్ల అన్నారు. సోమవారం ఊరెళ్లలో గల సాగర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్ఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, జనరల్ క్యాన్సర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే ఒకరి ప్రాణదానం చేసినట్టేఅని అన్నారు. 18నుంచి 60సంవత్సరాలలోపు ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయొచ్చన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకులు రాంనరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల బిల్లులు చెల్లించేందుకు కృషి

షాద్‌నగర్ రూరల్, జనవరి 29: గత ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా నేటికీ ప్రభుత్వం బిల్లులు చెల్లించ లేదని, కొత్త ప్రభుత్వంలో వారికి బిల్లులు చెల్లించేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ ఖాజా ఇద్రిస్ అధ్యక్షతన నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిల్లులు రాలేదని సర్పంచ్‌లు ఆవేదన చెందవద్దని, పదవీ కాలం ముగుస్తున్నందున వారినే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలకు సేవకులుగా పనిచేయాలని తెలిపారు. తాను రాజకీయ కక్షలకు తావివ్వనన్నారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామ సమస్యలపై సభలో లేవనెత్తారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమావేశంలో వైస్ఎంపీపీ మౌనిక, జెడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బక్కన్న, ఎంపీడీఓ వినయ్‌కుమార్, తహసీల్దార్ పార్థసారథి పాల్గొన్నారు.


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కుందేలుకంటతండాలో పంచాయతీ భవనం, బూర్గులలో పశువైద్య శాలను ప్రారంభించారు. సామాన్యులకు అందుబాటులో కాంగ్రెస్ పాలన ఉంటుందన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ జెండాను ఎగరవేశారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్‌లు అరుణశివకుమార్, రవి, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం-శ్రీశైలం పాదయాత్ర

మండలంలో పుణ్యక్షేత్రమైన రామేశ్వరం ఆలయం నుంచి శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. సినీ నిర్మాత బండ్ల గణేష్ సోదరుడు శివబాబు నేతృత్వంలో ఏటా పుష్య మాసంలో పాదయాత్ర చేస్తారు. సోమవారం తన బృందంతో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే శంకర్ పాదయాత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

మహిళా అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

నందిగామ: మహిళా అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో జెడ్పీ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే, ఎంపీపీ ప్రియాంక, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రారంభించారు. ఈ భవనం కోసం గ్రామానికి రవీందర్‌రెడ్డి స్థలం విరాళంగా ఇచ్చారు. స్థల దాతను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జేకే. నర్సింలు, ఎంపీటీసీ లత్‌శ్రీశైలం, ఉపసర్పంచ్ సీతారాములు, క్రిష్ణ, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.


అప్పారెడ్డిగూడలో మహిళా సమాఖ్య భవనం ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు

పంచాయతీకి నిధులు కేటాయించాలి


ఎంపీపీ జయమ్మకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్

శంషాబాద్ రూరల్ జనవరి 29 : మండల పరిధిలోని జూకల్, అల్లికోల్‌తండా, కాచారం గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని సోమవారం ఎంపీటీసీ బుక్క ప్రవీణ్‌కుమార్.. ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, ఎంపీడీవో వసంతలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ మాట్లాడుతూ... నగర శివారు గ్రామాలైనా ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని, ఇప్పటికైనా అధికారులు ఆయా పంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరామని పేర్కొన్నారు. ఐదేళ్లలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. నిధులు కేటాయిస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కిట్టు, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా


ఖైరంపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే అంజయ్య

కొందుర్గు, జనవరి, 29: తాఆను బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. సోమవారం అయోధ్యపూర్ తండా, చిన్న ఎల్కిచర్ల, పులుసుమామిడి, పర్వతాపూర్, మహదేవ్‌పూర్, ఖైరంపల్లి, ఉత్తరాస్‌పల్లి, ముట్పూర్, రేగడి చిల్కమర్రి, లాలాపేట్, ఉమ్మెంతాల గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉంటానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మెరుగైన పాలన అందించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, నాయకులు నారాయణయాదవ్, శ్రీధర్‌రెడ్డి, సంధ్యారాణి శేఖర్, అంజనేయులు, రెడ్డి నర్సింలు, గోపాల్, బద్రి, బందులాల్, కలాం, దర్గా రాంచంద్రయ్య, సరస్వతి, విజయ్‌కుమార్, మాజిద్ పాల్గొన్నారు.

వేగంగా ట్యాంక్ నిర్మాణం

మిషన్ భగీరథ అధికారులు స్పందించారు.

ఆమనగల్లు, జనవరి 29 : మండల పరిధిలోని కొత్తకుంట తండాలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల చివరికల్లా అసంపూర్తి పనులు పూర్తిచేసి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త కుంట తండాలో మిషన్ భగీరథ నీరు అందక గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై 2023 ఆగస్టు 11న 'మిషన్ నిష్ఫలం?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఈ మేరకు అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సర్పంచ్ శోభ చందునాయక్ ఒత్తిడితో తండాలో 20వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.14లక్షలు మంజూరు చేసింది. నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు మిషన్ భగీరథ ఏఈ శరత్, ఎంపీడీవో ఫారూఖ్‌హుస్సేన్, ఎంపీవో శ్రీలత, సర్పంచ్ శోభ, ఉప సర్పంచ్ జాన్యల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ట్యాంక్ పనులు తుది దశకు చేరుకున్నాయి. వారం రోజుల్లో వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభిస్తారని సర్పంచ్ తెలిపారు.


తండాలో నిర్మాణం పూర్తి కావొచ్చిన ఓవర్‌హెడ్ ట్యాంక్

సొంత గ్రామానికి, విద్య నేర్పిన పాఠశాలకు సేవ చేయాలి

యాచారం, జనవరి 29: జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, సొంత గ్రామానికి, విద్యనేర్పిన గురువులకు సేవచేయాలని మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్, గున్గల్ పాఠశాల పూర్వ విద్యార్థి డి.శ్యాంసన్ అన్నారు. 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనాన్ని సోమవారం పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. నాడు గురువులు విద్యాబుద్ధులు నేర్పడం వల్లే తాను జాయింట్ కలెక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తున్నానన్నారు. తన బ్యాచ్ విద్యార్థులను కలుస్తానని ఊహించలేదన్నారు. మనం ఉన్నతి స్థితికి చేరితే తల్లిదండ్రులు, గురువులు సంతోషిస్తారన్నారు. పూర్వ విద్యార్థులు కె.జగన్, మంజుల, రాములు, డి.రాజు. సుదర్శన్‌రెడ్డి బాబురావు పాల్గొన్నారు.


గున్గల్ జెడ్పీ పాఠశాల 1989-90 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కందుకూరు సీఐగా మక్బుల్ జానీ

కందుకూరు, జనవరి 29 : కందుకూరు సీఐగా ఎండీ మక్బుల్ జానీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన విష్ణువర్ధన్‌రెడ్డి సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న మక్బుల్ జానీని ఇక్కడికి బదిలీపై వచ్చారు. దీంతో ఆయన తన ఆఫీసులో బాధ్యతలు చేపట్టారు.



ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నాయకులు



చేవెళ్ల, జనవరి 29: ఎమ్మెల్సీగా ఎంపికైన కోదండరాంను తెలంగాణ జన సమితి చేవెళ్ల నియోజకవర్గం యూత్ సభ్యులు సోమవారం కలిశారు. హైదరాబాద్‌లోని కోదండరామ్ నివాసంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మోడల్ స్కూల్స్ అవర్డిబెస్ట్ టీచర్లు రమేశ్, శికుమార్, శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి కోదండరాంను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వినయ్, శేఖర్, మహేశ్, శ్రీకాంత్, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

చెర్లగూడ పంచాయతీ భవనం ప్రారంభం



షాబాద్/చేవెళ్ల, జనవరి 29: గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తామని షాబాద్ జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం చెర్లగూడ నూతన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ పుష్పమ్మతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో సీసీ రోడ్లు, చెర్లగూడ-ఆస్పల్లిగూడ రోడ్డు వంతెన నిర్మాణం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మధుకర్‌రెడ్డి, నాయకులు నర్సింగ్‌రావు, రాజేందర్‌రెడ్డి, వెంకటయ్య, పీఎస్ కృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

ఒత్తిళ్లను అధిగమిస్తే ఉత్తమ ఫలితాలు

ఆమనగల్లు, జనవరి 29: పదో తరగతి విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమించి ప్రణాళిక, ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని వ్యక్తిత్వవికాస నిపుణుడు గంప నాగేశ్వర్‌రావు, ఈ-అభ్యాస్ సీఈవో భువనగిరి, ఫణిపవన్‌శాస్త్రి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బీరప్ప, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటయ్య అన్నారు. ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం అన్నారు. ఆమనగల్లులోని భవానీ గార్డెన్‌లో సోమవారం ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దంద మండలాల టెన్త్ విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ట్రస్మా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాలాపూర్ శ్రీవాగ్దేవి జూనియర్ కళాశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ తరగతులకు వీరంతా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా స్వీయ ప్రణాళిక, పాఠ్యాంశ పునశ్చరణ చేసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి జీవితానికి టెన్త్ ఓ మైలురాయి వంటిదన్నారు. కష్టపడితే పదిలో 10జీపీఏ సాధించొచ్చని సూచించారు. ప్రేరణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానంలో రాణించాలని నాగేశ్వర్‌రావు, ఫణిపవన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి చుక్క అల్లాజిగౌడ్, కోశాధికారి జె.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు మహమూద్, అవ్వారి శివలింగం, వెంకన్న, తిరుమలేశ్, బీజు జోసెఫ్, జంగయ్య, శేఖర్, టీచర్లు నరేశ్, చలం, లింగం, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రేరణ తరగతుల్లో పాల్గొన్న గంప నాగేశ్వర్‌రావు, తదితరులు

ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం

కడ్తాల్: ఎమ్మెల్సీగా నియమితులైన టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంను కడ్తాలకు చెందిన యువజన సంఘాల ఐక్య వైదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కోదండరాం నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఉద్యమ సారథికి ప్రభుత్వం ఎమ్మెల్సీగా పదవి ఇవ్వడం అభినందనీయమని రాఘవేందర్ అన్నారు. మంత్రివర్గంలోనూ ఆయనకు చోటు కల్పించాలని ఆయన కోరారు.



అభివృద్ధిలో రాజకీయాలకు చోటివ్వొద్దు

కడ్తాల్, జనవరి 29: అభివృద్ధిలో రాజకీయాలకు చోటివ్వకుండా ప్రజలంతా పాలుపంచుకోవాలని కడ్తాల సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజాభాగస్వామ్యం మరింత పెరగాలన్నారు. కడ్తాలలో వడ్డెర కమ్యూనిటీ హాల్‌కు ఎంపీ రాములు రూ.5లక్షలు మంజూరు చేయగా సోమవారం పంచాయతీ కార్యాలయంలో ప్రొసీడింగ్ కాపీని సర్పంచ్ వడ్డెర సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, బిక్షపతి, రాంచంద్రయ్య, యాదయ్య, జంగయ్య శ్రీను, బాలయ్య, నర్సింహ, నాగార్జున పాల్గొన్నారు.

'కుల గణనతో సామాజిక న్యాయం'

కడ్తాల్, జనవరి 29: సమాజంలోని ప్రతీ వర్గానికి జనాభా పరంగా వాటా దక్కాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కుల గణన ద్వారానే అది సాధ్యం అని సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేస్తామని ప్రకటించారన్నారు. కడ్తాలలో ఎంపీపీ కమ్లి, డీసీసీ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహలతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా హక్కులు, ఉద్యోగాలు రావాలంటే కుల గణన ఏకైక మార్గమన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే కుల గణన తీర్మానం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దేశంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కుల గణన చేస్తామని ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ ప్రకటించారన్నారు. 1931లో నిజాం పాలన గణాంకాలు మినహా ఇప్పటికీ ప్రభుత్వం వద్ద కులగణన లెక్కలు లేవన్నారు. నిమ్న వర్గాలకు దక్కాల్సిన వాటా దక్కడం లేదన్నారు. సమావేశంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, బిచ్యా, గురిగళ్ల లక్ష్మయ్య, యాదగిరిరెడ్డి, చందోజీ, లక్ష్మణ్, కృష్ణ, శేఖర్‌గౌడ్, ఇమ్రాన్‌బాబ, ప్రభు, రాజేశ్, బిక్కు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే ప్రగతి : జెడ్పీటీసీ

కడ్తాల్, జనవరి 29: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు ఒనగూరి ఇబ్బందులు తీరాయని జిల్లా గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు పనిచేయాలని కోరారు. ఎక్వాయిపల్లిలో రూ.12.5లక్షలతో నిర్మించిన వైకుంఠధామాన్ని సోమవారం సర్పంచ్ సుగుణసాయిలు, ఎంపీటీసీ ఉమావతిబుగ్గయ్యగౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. పాఠశాలలో వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. నాయకులు వీరయ్య, బిక్షపతి, వెంకటేశ్, చంద్రయ్య, చోటే, యాదయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, ఏఈ పరమేశ్ పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలపై దృష్టి సారించాలి

చౌదరిగూడ, జనవరి 29: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మాటలతో కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రజలకు ఎలాంటి మేలు చేయడం లేదని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బాబురావు అన్నారు. సోమవారం చౌదరిగూడలో పార్టీ మండలాధ్యక్షుడు హఫీజ్ అధ్యక్షతన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలన సౌలభ్యం కోసమే చిన్న పంచాయతీలను ఏర్పాటు చేసిందే తప్ప రాజకీయాల కోసం కాదన్నారు. నూతన ఎమ్మెల్యే బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన భవనాలనే ప్రారంభిస్తూ పోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కుమారుడు చెబితే పంచాయతీలు ఏర్పాటు చేశారంటూ గుంజల్‌పహాడ్‌లో ఎమ్మెల్యే శంకర్ అడనం సరికాదన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు శివ, ప్రేమ్‌కుమార్, ఎంపీటీసీ రాములు, బీఆర్ఎస్ నాయకులు వజ్రలింగం, మాణెయ్య, వెంకటేష్, గణేష్, లక్ష్మయ్య, జానీ, శివరాజ్, చెన్నయ్య, మల్లేష్, రవి, సందీప్ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దు

చేవెళ్ల, జనవరి 29 : 18సంవత్సరాలు నిండి లైసెన్స్ ఉన్న వాళ్లు మాత్రమే వాహనాన్ని నడపాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం అన్నారు. ట్రిపుల్ రైడింగ్ వెళ్లొద్దన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉండాలి

ఆమనగల్లు: విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్సై రవీందర్ కోరారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయన్నారు. ఆమనగల్లులోని జూనియర్ కళాశాల, బాలుర పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేప్పుడు హెల్మెంట్ ధరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు, సోదరులకు, బంధువులకు చెప్పాలని కోరారు. ప్రతీ ఒక్కరు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రవీందర్ నాయక్ కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనసూయ, హెచ్ఎం సుదర్శన్‌రెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్

పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి

కడ్తాల్, జనవరి 29: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు. కడ్తాల మండలం మైసిగండిలో కాంగ్రెస్ నాయకుడు, గిరిజన నేత జె.జవహర్‌లాల్‌నాయక్-ప్రేమ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జేపీ క్యాస్టిల్‌ను జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్రతాలు, హోమం, పూజల్లో వారు పాల్గొన్నారు. జవహర్‌లాల్ అతిథులను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చొరవతో పెట్టుబడులకు విదేశీ కంపెనీలు రానున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సీఐలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఏఈలు నరేందర్, సీతారామ్, సర్పంచ్ తులసీరామ్,ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నిర్వాహకులు సుభాష్ సుమన్, తేజశ్రీ, సంపత్,నాయకులు హీరాసింగ్, రాందాస్,రమేశ్, మురళి, భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, కృష్ణ, యాదగిరిరెడ్డి, నరేశ్, వెంకటేశ్, మోత్యనాయక్, సుమన్, బిచ్యా, ఇమ్రాన్‌బాబ తదితరులు పాల్గొన్నారు.


జేపీ క్యాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, పాల్గొన్న నాయకులు

పరీక్షల సమయంలో సమయపాలన పాటించాలి


విద్యార్థులకు వివరిస్తున్న స్కూల్ బోర్డు మెంబర్ వీరేందర్‌గౌడ్

మహేశ్వరం, జనవరి 29 : విద్యార్థులు పరీక్ష సమయంలో తగిన జాగ్రలు పాటించి విద్య అభ్యసించాలని, అలాంటప్పుడే మంచి ఫలితాలు వస్తాయని దేవేంద్ర విద్యాలయ బోర్డు సభ్యుడు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి టి.వీరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయలో పరీక్షపై చర్చ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల కోసం ప్రధాని చేసిన వీడియోను ప్రదర్శించారు. వీరేందర్‌గౌడ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్ష సమయంలో మానసిక ఒత్తిడి నుంచి ఎలా జయించాలి, చదవడానికి సమయాన్ని ఏ విధంగా కేటాయించాలని, ఆరోగ్యంపై ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాలపై వివరించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ల సేవలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. అదే విధంగా దేశ ప్రధానిగా ఒత్తిడిని ఎలా జయిస్తున్నారో పలువురు అడిగిన ప్రశ్నలకు నరేంద్ర మోడీ ఒక్కటే సమాధానం చెప్పారన్నారన్నారు. అదేమిటంటే ' తాను తన కోసం కాకుండా భారత జాతి కోసం పని చేస్తా.' అని ప్రధాని చెప్పారని వీరేందర్‌గౌడ్ అన్నారు. భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రిన్సిపాల్ మాధవిశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి పాల్గొన్నారు.

శివగంగ ఆలయ కమిటీ చైర్మన్‌గా జంగయ్య?

మహేశ్వరం, జనవరి 29: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహేశ్వరంలోని రాజరాజేశ్వరాలయ కమిటీ పాలకవర్గం ఆ పార్టీకి చెందిన వారే ఉండగా కొత్త కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పాలకవర్గం రద్దయింది. ఈ నేపథ్యంలో మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వర ఆలయకమిటీ చైర్మన్ పదవి కోసం మండల కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు మొదలయ్యాయి. యేటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ ఆలయంలో వైభవంగా నిర్వహిస్తారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ చేతుల మీదుగా ఉత్సవాలను నిర్వహించాలని నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ పదవి కోసం గడగూటి జంగయ్య, అల్లె కుమార్ పోటీ పడుతున్నారు. ఆలయ చైర్మన్‌గా జంగయ్యనే నియమించాలని కాంగ్రెస్ నాయకులు అధిష్ఠానానికి విన్నవించారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

గుర్రంపీర్‌కు ఎంపీపీ ప్రత్యేక పూజలు

చౌదరిగూడ, జనవరి 29: మండల పరిధి గుర్రంపల్లి జాతరలో భాగంగా ఎంపీపీ యాదమ్మ సోమవారం గుర్రం పీర్‌కు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉర్సును కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం చాలా సంతోషమని ఆమె అన్నారు.



క్రైం కార్నర్

శివాలయంలో చోరీ.. నగదు అపహరణ

కొత్తూర్, జనవరి 29 : మండలంలోని గుడూర్‌లో గల శివాలయంలో ఆదివారం దొంగలు హుండీలు పగులగొట్టి నగదు దోచుకున్నారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... ఆలయ పూజారి మల్లికార్జునశర్మ ఆదివారం రాత్రి ఆలయానికి తాళం వేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆలయ తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. దీంతో పూజారి ప్రజాప్రతినిధులకు సమాచారమిచ్చారు. దొంగలు ప్రహరీ దూకి ఆలయంలోకి ప్రవేశించి గర్భగుడిలో దూరారు. అక్కడి వస్తువులు ముట్టలేదు. శివాలయ ఆవరణలోని రెండు హుండీలను ఎత్తుకెళ్లి ఊరిబయటకు బద్దలుకొట్టి వాటిల్లోని నగదును దోచుకున్నారు. సమాచారం అందుకున్న కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. పూజారి మల్లికార్జునశర్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. దొంగల కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


హుండీలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

సంక్షిప్తంగా...

● **కేశంపేట:** గొర్రెలు, మేకల పెంపకంతో గొల్ల, కురుమలు ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిషత్ ఆవరణలో సోమవారం పెంపకందారుల సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ రుణాలతో జీవాల పెంపకాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. షెడ్లలో జీవాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, గోపాల్, పెంటయ్య, ఇప్పలపల్లి సర్పంచ్ ఆంజనేయులు, మల్లేష్ పాల్గొన్నారు.

● **తలకొండపల్లి:** ఐదేళ్ల పదవీ కాలంలో చంద్రధనను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపామని సర్పంచ్ కుమార్ అన్నారు. రూ.కోటితో అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామంలో సర్పంచ్ తన తాత బక్కి బాలయ్య, తండ్రి చెన్నయ్య స్మారకార్థం నిర్మించిన గ్రామ ముఖ ద్వారాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, తన తల్లి వెంకటమ్మతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు కృష్ణవేణి, రాణి, సునీత, వెంకటేశ్, చైతన్య, నాయకులు రాములు, ప్రసాద్, నర్సింహ, జంగయ్య, రమేశ్, సాయిబాబ, రవీందర్‌రెడ్డి, సత్తయ్య, అయ్యప్పచారి, సురేశ్, కుమార్, పర్వతాలు, అజయ్, మనోహర్, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● **తలకొండపల్లి:** బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌ను తలకొండపల్లి బీజేవైఎం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి నీలకంఠ పాండు ఆధ్వర్యంలో మహేందర్‌ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని మహేందర్ పిలుపునిచ్చినట్లు పాండు తెలిపారు. మహేందర్‌ను కలిసిన వారిలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహేశ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, విద్యార్థి పరిషత్ నాయకుడు వెంకటేశ్ ఉన్నారు.

యాచారం: యాచారం మండలం సాగర్-హైదరాబాద్ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సమయంలో డ్రైవింగ్ సర్టిఫికెట్లు, బీమా లేని వాహనాదారులు దొడ్డిదారిన మాల్, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లారు. పోలీసులు నంబర్ ప్లేట్ లేని వాహనాల దారులకు జరిమానా విధించారు. ఆటోలు, క్రూయిజర్లలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వారిని దింపేసి డ్రైవర్లకు సూచనలు చేశారు.

మాడ్గుల: ఉపాధి హామీ పనులపై 13వ విడత సామాజిక తనఖీ సమావేశం మండల పరిషత్‌లో ఈ నెల 31న ఉదయం 10గంటల నుంచి నిర్వహిస్తామని ఎంపీడీవో రాఘవులు తెలిపారు. గ్రామాల్లో 1 మార్చి 2022 నుంచి 31 మార్చి 2023 వరకు చేసిన పనులపై తనఖీ బృందాలు పది రోజులు తనిఖీ చేశారన్నారు. 31న సోషల్ ఆడిట్ బృందాలు తుది నివేదికలను ప్రజా వేదికలో వెల్లడిస్తారని ఎంపీడీవో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, ఉపాధి కూలీలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు.

● **కేశంపేట:** సాధారణంగా ఉద్యోగులు రోజుకు 8గంటలుగా మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఓ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగి నాలుగు రోజులుగా ఏకధాటిగా పనిచేస్తూ రిలీవర్ కోసం ఎదురు చూస్తున్నాడు. కొండారెడ్డిపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ఇటీవల వినియోగంలోకి తెచ్చారు. ఇక్కడ శివకుమార్ అనే జూనియర్ లైన్‌మన్‌కు విధులు కేటాయించారు. అతడు నాలుగు రోజులుగా విధులు నిర్వహిస్తున్నా రిలీవర్ రాక ఇబ్బందులు పడుతున్నాడు.